క్లుప్తంగా

రాజమౌళికి డాక్టరేట్



మహబూబాబాద్ రూరల్: మండలంలోని జంగిలిగొండ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి, బుల్లితెర కళాకారుడు గడ్డం రాజమౌళి డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాదు రవీంద్రభారతిలో న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ జోసఫ్ పలంగి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్.. రాజమౌళికి డాక్టరేట్ అందజేశారు. ప్రస్తుతం రాజమౌళి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా ఉద్యోగం చేస్తున్నారు.

రెఫరీలుగా డోర్నకల్ వాసులు



డోర్నకల్: కరీంనగర్‌లో జరుగుతున్న మూడో తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ రెఫరీలుగా డోర్నకల్ వాసులు వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరుగుతున్న స్పోర్ట్స్ మీట్‌లో వెయిట్ లిఫ్టింగ్‌కు డోర్నకల్ భారత్‌వీర్ వ్యాయామశాలకు చెందిన మండలోజు కృష్ణమూర్తి, మండలోజు సుధాకర్, శ్రీపాద శ్రీనివాస్ రెఫరీలుగా వ్యవహరిస్తున్నారు. వీరు మంగళవారం వరంగల్‌లో అడిషనల్ డీసీపీ సురేష్‌కుమార్(సీబీఆర్)ను మర్యాదపూర్వకంగా కలిశారు.

డీడీని కలిసిన సీఆర్టీలు



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ గుగులోతు దేశీరాంనాయక్‌ను జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందంచి సన్మానించారు. ఈసందర్భంగా సీఆర్టీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ బడ్జెట్‌లో సీఆర్టీల వేతనాలు అకౌంట్లలో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టం శంకర్, రాష్ట్ర కార్యదర్శులు కున్సోత్ దేవేందర్, ధరావత్ శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మహబూబాబాద్ అర్బన్: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన ఎంతో అవసరమని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. మానుకోట మున్సిపల్ అనంతారం మోడల్ స్కూల్‌లో మంగళవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. కలెక్టర్ చేతుల మీదుగా ఈ నెల 31 బహుమతులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సాయి చరణ్, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, సైన్స్ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నెహ్రూసెంటర్: జిల్లా నూతన విద్యుత్ ఉద్యోగుల యూనియన్, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్ సమక్షంలో ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా డి.రవికుమార్, రీజనల్ ప్రెసిడెంట్‌గా మోడెం వెంకన్న, రీజనల్ సెక్రెటరీగా సీహెచ్ రాంరెడ్డి, ట్రెజరర్‌గా ఎం.కేదారి, డివిజన్ అడ్వయిజర్‌గా ఎం.జంపిరావు, డివిజన్ ప్రెసిడెంట్‌గా పంజాల రవీందర్, డివిజన్ సెక్రటరీగా ఎం.వీరప్రసాద్, ట్రెజరర్‌గా బి.సంజీవయ్య ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేకు వినతి

బయ్యారం: స్త్రీ నిధి రుణాల్లో అవినీతి అక్రమాలకు పాల్పడిన బాలాజీపేట వీఓఏ పై చర్య తీసుకోవాలని గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు మంగళవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు.

తూతూ మంత్రంగా గ్రామసభలు

మరిపెడ రూరల్: మండలంలో నాలుగు రోజులుగా జరిగిన గ్రామసభలు గందరగోళాల మధ్య ముగిశాయి. ఉపాధి హామీ టీఏ, ఏపీఎం, గ్రామ ప్రత్యేక అధికారులు, ఇతర శాఖ అధికారులు, గ్రామస్తులు లేకుండానే కేవలం గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో తూతూ మంత్రంగా ముగించారు. మంగళవారం మండలంలోని గుండెపుడి, తానంచర్ల, ఉల్లెపల్లి, దంటకుంటతండా, బాల్యతండా, భూక్యతండా, గుర్రప్ప తండా, ఆనెపురం బురికితండా, తాళ్లఊకల్ గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు జరిగాయి. మండల వ్యాప్తంగా ఈజీఎస్ పనుల్లో లక్షల రూపాయలు దుర్వినియోగం జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేలింది.

కాస్మోటిక్ డబ్బులు వచ్చేనా?

- తొమ్మిది నెలలుగా ఇబ్బందులు పడుతున్న బాలికలు
- కేజీబీవీ విద్యార్థినులపై ప్రభుత్వం చిన్నచూపు

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన (కేజీబీవీ) కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతున్న బాలికలు ఎక్కువశాతం తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు చదువుతున్నారు. ప్రభుత్వం బాలికల అవసరాల కోసం సబ్బులు, దువ్వెన, కొబ్బరినూనె బొట్టు బిళ్లలు, పౌడర్, వంటి ఇతర కాస్మొటిక్ కిట్లను పంపిణీ చేసింది. తర్వాత కాస్మొటిక్ కిట్లకు బదులుగా బాలికలకు ప్రభుత్వం నెలకు ఒక్కరికి రూ.100 చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో బాలికలు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలు తెరిచారు. ఆ డబ్బులతో బాలికలు వారికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేవారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి సుమారు 9నెలలు గడిచింది. కేజీబీవీలో చదువుతున్న బాలికలకు కాస్మొటిక్ బిల్లులు అందించడం లేదు. దీంతో ఆనాథగా ఉన్న బాలికలకు ఆర్థికంగా కష్టతరం అవుతుంది. కొన్నిచోట్ల బాలికల అవసరాన్ని బట్టి కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ఏఎన్‌ఎంలు, పీడీలు, మహిళా టీచర్లు డబ్బులు ఇస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా పాలన ఉన్నత, విద్యాశాఖ అధికారులు స్పందించి కేజీబీవీలో చదువుతున్న బాలికలు కాస్మొటిక్ బిల్లులు అందించాలని బాలికల బంధువులు, మహిళ ఉపాధ్యాయురాలు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. మానుకోట జిల్లాలో కస్తూర్బాగాంధీ విద్యాలయాలు 16 ఉన్నాయి. మొత్తం బాలికలు సుమారు 3,315 మంది చదువుతున్నారు. వారికి కాస్మొటిక్ బిల్లులు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కేజీబీవీలో చదువుతున్న బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.



మానుకోటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం

బాలికల అకౌంట్లు అందించాం



జిల్లాలో కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతున్న బాలికల వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లు రాష్ట్ర విద్యాశాఖకు అందించాం. కాస్మొటిక్ కిట్లకు సంబంధించిన డబ్బులను విద్యార్థుల బాలికల అకౌంట్లలోనే జమ చేస్తుంది. బిల్లులు మంజూరు అయ్యే విధంగా ప్రత్యేక చొరవ తీసుకుంటాం.

– గుండ్ల విజయకుమారి, జీసీడీఓ, మానుకోట

యూపీఎస్ గెజిట్ ప్రతుల దహనం



పత్రాలను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు తలపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పూసపాటి నాగమూణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముడురు ప్రభుత్వ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో మంగళవారం యూపీఎస్ పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరన్న, హెచ్‌ఎంలు ఝాన్సీరాణీ, హాల్యానాయక్, ఉపాధ్యాయులు బాలాజీ కుమార్, నాయకులు నరేష్, శంకర్, వరలక్ష్మి, మంగీలాల్ పాల్గొన్నారు.

బయ్యారం: ఏప్రిల్ 1నుంచి అమలులోకి రానున్న యూపీఎస్(నూతన పెన్షన్) గెజిట్ ప్రతులను మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో దహనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, రవిందర్, దస్తగిరి, భిక్షం, రామేశ్వరరావు, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, రూప్లా పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశాడు. హామీలు అమలు చేయాలని ఫిబ్రవరి 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంగళవారం పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా గౌని ఐలయ్య మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తామని చెప్పి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది దాటిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో జడ సత్యనారాయణ, గుజ్జు దేవేందర్, హలావత్ లింగ్య, పుల్లన్న, ఇడంపాలక శ్రీశైలం, యాకన్న, ఊడుగుల లింగన్న, పుణెం భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలి

- న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్

గార్ల: దేశంలో ప్రశ్నించే కమ్యూనిస్టుల గొంతుకలను అణిచివేస్తూ, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై పోరాటాలకు సన్నద్ధం కావాలని న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కొత్తతండాలో జరిగిన పార్టీ బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజాపాలనను గాలికొదిలేసిందన్నారు. అనంతరం పార్టీలో పలువురు చేరారు. భావ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, జడ సత్యనారాయణ, గౌని భద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవర్ధన్

వాహనాల వేలం

తొర్రూరు: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 57వాహనాలకు మంగళవారం డివిజన్ కేంద్రంలోని అబ్కారీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. ఎక్సైజ్ జిల్లా సూపరిటెండెంట్ కిరణ్, ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా పలు ప్రాంతాలకు చెందిన వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. రూ.22.47లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు వచ్చినట్లు తెలిపారు. సంబంధిత మొత్తాన్ని ఎక్సైజ్ పోలీసులు ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు. ఎస్సైలు రవళిరెడ్డి, ఎన్. శంకర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



దంతాలపల్లి: హెల్మెట్ ధరించిన వాహనదారులకు పువ్వులు అందజేస్తున్న ఎస్సై

గూడూరు: ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్ ధరించి ప్రమాదాలను అరికట్టాలను సీఐ సూర్యప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

దంతాలపల్లి: వాహనదారులు హెల్మెట్ ధరించి, ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్సై పిల్లల రాజు అన్నారు. రోడ్డు భద్రతా ఉత్సవాలలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలు వస్తే చర్యలు



గ్యాస్ ఏజెన్సీలో తనిఖీ చేస్తున్న అధికారి

తొర్రూరు: తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని పలు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. డీసీఐసీ జిల్లా కన్వీనర్ వింజమూరి సుధాకర్‌తో కలిసి తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన మూడు దుకాణాలపై కేసులు నమోదు చేయగా, రూ.30 వేల జరిమానా విధించారు. ప్యాకింగ్ ఉత్పత్తులపై ముద్రిత ధరల కంటే ఎక్కువకు విక్రయించినా, ఎంఆర్‌పీ ధరలను ముద్రించకుండా విక్రయాలు జరిపినా కేసులు నమోదు చేస్తామన్నారు. వంట గ్యాస్ సరఫరాలో అదనపు వసూళ్లు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

శిలాఫలకం ధ్వంసం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని లక్ష్మా తండా గ్రామంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మోజెస్ మహబూబాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక మంగళవారం రాత్రి తెలిపారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా మహేష్



నెహ్రూసెంటర్: జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా చిట్టిమళ్ల మహేష్, ప్రధాన కార్యదర్శిగా బెజ్జం ప్రేమ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మంగళవారం తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా పథకం నగదు జమ చేసినందులకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుంచు సంతోష్, అల్లం నాగేశ్వర్‌రావు, దనియాకుల రామారావు, ముద్దసాని సురేష్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి ఎల్లయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యంగా ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పేందుకు చేపట్టిన లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని సంపూర్ణ మద్దతు తెలుపుతూ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొంగ్ర ఎల్లయ్యమాదిగ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. జాతి కోసం, వర్గీకరణే లక్ష్యంగా 30ఏళ్లుగా మందకృష్ణ నాయకత్వంలో ఉద్యమాలు జరిగాయన్నారు. గుడిసెలు వేసుకుని జీవిస్తున్న కేటీఆర్ కాలనీ పేదలకు రహదారి సౌకర్యం కల్పించాలని జిల్లా అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పులి శ్రీను, కుక్కల సుధా, సీహెచ్ రాధ, బాలరాజు, సందీప్, బాలకృష్ణ, మాధవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లయ్య

సంక్షిప్త సమాచారం

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం

గార్ల: గార్ల ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో నేడు జాతీయ ఉపాధి హామీ పథకం ఓపెన్ ఫోరం సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంగమ్మ మంగళవారం వెల్లడించారు.

ఫిబ్రవరి 3నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

గార్ల: సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకొని ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాలోత్ భాస్కర్‌నాయక్, భూక్యా సర్వేష్‌నాయక్‌లు మంగళవారం తెలిపారు. టీం ఎంట్రీలను నమోదు చేసుకునేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 31తేదీ లోపు ఈ సెల్ 99630 60396, 84979 08478 నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

అంతర్జాతీయ సదస్సులో మరిపెడ కవి



మరిపెడ రూరల్: తెలుగు శాఖ మద్రాస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మరిపెడకు చెందిన ప్రముఖ కవి వివమర్శకులు పెద్దోజు నరేష్ పాల్గొన్నారు. తొలితరం ముస్లిం కవి ఆధ్యాత్మిక వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం–బహుముఖీనత సదస్సులో ఆయన ప్రసంగించారు.

నూతన కమిటీ ఎన్నిక

నెల్లికుదురు: డీటీఎఫ్ మండల నూతన శాఖ కమిటీని మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బుదారపు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడుగా ఎం.రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుధాకర్, ఉపాధ్యక్షులుగా హరిసింగ్, పుష్పనీలా, కార్యదర్శులుగా రామస్వామి, దేవేందర్, సవిత, జిల్లా కౌన్సిలర్‌గా యాదగిరి, రాజశేఖర్, ఆడిట్ కన్వీనర్‌గా వినయ్ కుమార్, సభ్యులు వెంకన్నలను ఎన్నుకున్నారు.

బీసీ సంఘం అధ్యక్షుల నియామకం

కురవి: జాతీయ బీసీ సంఘం సీరోలు మండల అధ్యక్షుడిగా సీరోలు గ్రామానికి చెందిన మక్క గోవన్నను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బండారు వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కసనబోయిన మల్లయ్య, యూత్ అధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా బోయిన రంజిత్‌లు ఎన్నికయ్యారు. కురవి మండలం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఐలివీరేందర్, గుంటుక యాదగిరి నియామకం అయ్యారు.

రైతుకు సన్మానం

దోర్నకల్: మండలంలోని పాతదుబ్బతండాకు చెందిన బానోత్ హరిసింగ్‌ను రెండెకరాలలో మిరప తోట సాగు చేసి అధిక దిగుబడులు సాధించాడు. మంగళవారం వ్యవసాయ క్షేత్ర పరిశీలనలో భాగంగా రైతులు హరిసింగ్ సాగుచేసిన తోటను పరిశీలించి సన్మానించారు.

అక్రమ పట్టాను రద్దు చేయాలని వినతి

మహబూబాబాద్: గార్ల మండలం, ముల్కనూర్ రెవెన్యూ గ్రామపరిధిలో అక్రమంగా ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని న్యాయవాది విశ్వ జంపాల కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కురవి: లబ్ధిదారులకు ఇంటికే నేరుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తీసుకొచ్చి పంపిణీ చేస్తున్నామని సీరోలు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు అన్నారు. సీరోలు మండలం కొత్తూరు గ్రామానికి వెళ్లి లబ్దిదారులకు ఇంటి వద్దనే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు.

రైల్వేస్టేషన్‌లో తమిళనాడు వాసి మృతి

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. జీఆర్‌పీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని గంగవెల్లి జిల్లాలోని కడంపూర్ గ్రామానికి చెందిన రామచంద్రన్‌దురైస్వామి(51) అనే వ్యక్తి మంగళవారం ఉదయం కేసముద్రం రైల్వేస్టేషన్‌లోని 1వ నెంబర్ ప్లాట్‌ఫాంలోని సిమెంట్ బెంచీపై పడుకుని చనిపోయాడు. మృతదేహన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా లక్ష పుష్పార్చన

మహబూబాబాద్ రూరల్: పుష్యమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో లక్ష పుష్పార్చన పూజను భక్తులు వైభవంగా నిర్వహించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కొత్తగూడ: మండలంలోని కార్లాయి, గోపాలపురం, బత్తులపల్లి, తాటివారివేంపల్లి, గుండం, తిమ్మాపురం, సరసనపల్లి గ్రామాల్లో పోలీసులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గూడూరు సీఐ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గుడుంబా, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తగూడ ఎస్సై కుశకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి బైక్ యాత్ర

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతుభరోసాతోపాటు హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ హరిదాస్‌తండా గ్రామానికి చెందిన గిరిజన రైతు భూక్య విజయ్‌కుమార్ నాయక్ నేటి(బుధవారం) నుంచి బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చోరీపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని రామన్నపేట కాలనీ చెందిన భూక్య లాల్ సింగ్ తన మేకపోతు చోరీకి గురికాగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ మంగళవారం రాత్రి తెలిపారు.

ఆర్గనైజర్ సెక్రటరీగా యశ్వంత్

కేసముద్రం: టీఆర్‌వీకేఎస్ డివిజన్ ఆర్గనైజర్ సెక్రటరీగా ఇనుగుర్తి లైన్‌మెన్ ఎం.యశ్వంత్ ఎన్నికైనట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంద కృష్ణకు క్షీరాభిషేకం

గంగారం: పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మందకృష్ణ మాదిగకు గంగారం మండల కేంద్రంలోని ఎమార్పీఎస్ నాయకులు సురేష్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, కిరణ్, రమేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతులనుంచి గింజలు తీసుకోవద్దు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సుధాకర్

మహబూబాబాద్ రూరల్: రైతుల వద్ద నుంచి కూలీలు దానధర్మాల పేరిట గింజలు తీసుకోవటం బంద్ చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో కూలీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎంసీ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ.. కూలీలకు గతంలో రూ.6చొప్పున చెల్లించేవారని, దానిని పెంచి బస్తాకు రూ.12చొప్పున ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల రైతుల దగ్గర నుంచి ధాన్యం, మక్కలు, అపరాలను తీసుకోకూడదని సూచించారు. ఎవరైనా దానం చేయాలని కూలీలు అడిగితే రైతులు తమకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో షంషీర్, రమేష్, నాగన్న పాల్గొన్నారు.

గద్దర్‌ను విమర్శించడం సరికాదు



మహబూబాబాద్ రూరల్: బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: కేంద్రంలో అధికారంలో వస్తే ప్రతి సంవత్సరం యువతకు రూ.2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన బీజేపీని బొందపెట్టాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ యువతకు పిలుపునిచ్చారు. దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. కార్యక్రమంలో మండల యువజన అధ్యక్షుడు రాంపెల్లి నవీన్, మాజీ కౌన్సిలరు పోతురాజు రాజు, శాగంటి సందీప్, జిల్లా ప్రధాన కార్యదర్శులు జీలుగుల భాస్కర్, ఉబ్బపల్లి శ్రవణ్, కార్యదర్శి నూనావత్ రాజేష్, వాంకుడోత్ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

తొర్రూరు: పద్మ అవార్డుల విషయంలో గద్దర్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించడం సరికాదని కాంగ్రెస్ సాంస్కృతిక విభాగం నియోజకవర్గ నాయకులు పంజాల బుచ్చిరాములు, కేదాసు రమేష్ అన్నారు. కార్యక్రమంలో కళాకారులు చెట్టుబోయిన యాకన్న, జంపయ్య వినయ్ పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ల సీజ్

గార్ల: మండలంలోని రాంపురం సమీపంలో గల పాకాల ఏటి నుంచి రాత్రి సమయంలో అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న సుమారు 40 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.స్వప్న మంగళవారం సీజ్ చేసినట్లు తెలిపారు. ఇట్టి ఇసుక డంప్ ధరావత్ లచ్చుకు చెందినదని గ్రామస్తులు తెలిపారన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పాకాల ఏటి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ హెచ్చరించారు. ఇసుక డంప్ పంచనామా అనంతరం రాంపురం పంచాయతీ కార్యదర్శికి అప్పగించామని, త్వరలో ఇసుక డంప్‌కు వేలం పాట పెట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ తిరుమలరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం వ్యాన్‌ను పట్టుకున్న పోలీసులు

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారంతో నెల్లికుదురు క్రాస్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా తొర్రూరు నుంచి కేసముద్రం వైపు వెళ్తున్న వాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిపారు. వాహనంలో తనిఖీ చేయగా రూ.1.60లక్షల విలువ చేసే 30బస్తాల నల్లబెల్లం, 2బస్తాల పటిక బెల్లాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మిర్చి రైతుల వినతి

మహబూబాబాద్ రూరల్: మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొబ్బల యాకూబ్ రెడ్డి పాల్గొన్నారు.

రేపటినుంచి శ్రీవారి ప్రతిష్ఠాపన మహోత్సవాలు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని ముడుపుగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయమూర్తి ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈనెల 30వ తేదీ గురువారం నుంచి వచ్చే నెల 3వ తేదీ సోమవారం వరకు అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆలయ నిర్మాణకర్త యాస వెంకటరెడ్డి అన్నారు. రామానుజ జీయర్ స్వామి కరకమలములచే శ్రీవేంకటేశ్వరస్వామి యంత్ర, మూర్తి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ శిఖరప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.